## గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ఈ నెల 16న జరగనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్ సమ్మెను జయప్రదం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో భారత కార్మిక ఉద్యమ నిర్మాత నారాయణ మేగాజీ లోఖండే 127వ వర్ధంతి సభ జరిగింది. ఏఐసీటీయూ, బీఎల్‌టీయూ, టీఎఫ్‌టీయూ, బీఎఫ్‌టీయూ, టీబీసీటీసీ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆ పార్టీ నాయకులు ఎస్.సిద్ధిరాములు, జె.అనిల్‌కుమార్, డాక్టర్ కాచం సత్యనారాయణగుప్తా, కె.ప్రసాద్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆధిపత్య ఆర్థిక విధానాలతో ప్రభుత్వ రంగాలు ధ్వంసం అవుతున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ పార్టీకి తగిన గుణపాఠం చెప్పినప్పుడే కార్మికులకు మేలు జరుగుతుందని తెలిపారు. జాతీయ సమ్మె విజయవంతానికి కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె.మధు, ఎస్.ఎం.ఖలీల్, కర్రె దానయ్య, యాదగిరి, రాజేందర్, శంకర్, శివానీ పాల్గొన్నారు.

**కేంద్రానికి బుద్ధి చెప్పాలి...**

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** జాతీయ గ్రామీణ సమ్మెను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వెంకటేశ్ మాట్లాడుతూ.. కార్మికులు, రైతుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోన్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ కార్యదర్శి కె.ధర్మేంద్ర, పీవైఎల్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, ఉపాధ్యక్షులు జావేద్, సత్యప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అన్ని ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న శివనాగేశ్వరరావు గౌడ్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకు ఆర్పీఐ(అఠావలే) పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు గౌడ్ తెలిపారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో తమ పార్టీకి అత్యధిక సభ్యత్వం ఉందని, ఎలాంటి పొత్తులు లేకుండా అభ్యర్థులను నిలపెడుతున్నామని తెలిపారు. ఈ నెల 12న తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు కూడా తెలంగాణకు రానున్నారని తెలిపారు. జాతీయ అధ్యక్షులు సమక్షంలోని తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించబోతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్, ప్రధాన కార్యదర్శి రత్నప్రసాద్, గోరఖ్‌సింగ్, మహిళా అధ్యక్షురాలు స్నేహలత, నగర అధ్యక్షురాలు వేముల పుష్పలత గౌడ్, ఉపాధ్యక్షులు శివరాజు, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అలరిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న క్రాంతి స్వరూప్ తదితరులు

**నల్లకుంట:** శ్రీ రామగాన సభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంట శ్రీ సీతారాంజనేయ సరస్వతి ఆలయంలో ఈ నెల 3న ప్రారంభమైన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆహుతులను అలరిస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్ర కార్యక్రమాన్ని రామగాన సభ కార్యదర్శి సాయి శ్రీనివాస శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీత విద్వాంసులు కొణికి రఘురామ్, మల్లెల క్రాంతి స్వరూప్ గానం ప్రేక్షకులను అలరించింది. సుదర్శన్ సుందరం-శ్రీనివాస గోపాలన్, కొండపల్లి శ్రీనివాస్-కోలంక సాయికుమార్, టీపీ బాలసుబ్రహ్మణియన్ వాద్య సహకారమందించారు. ఆదివారంతో ఆరాధన ఉత్సవాలు ముగుస్తాయని శ్రీనివాస శర్మ తెలిపారు.

**పురందర దాసు ఆరాధనోత్సవం..**

**నల్లకుంట:** శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కర్ణాటక సంగీత పితామహుడు పురందర దాసు ఆరాధనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివం సిండికేట్ బ్యాంక్ సమీపంలోని సంగీత విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురందర దాసు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మ మాట్లాడారు. కర్ణాటక సంగీత సాధనకు పురందర దాసు అనేక శాస్త్రీయ పద్ధతులు కనుగొన్నారని చెప్పారు. ఆయన వాగ్గేయకారుడు, సంగీత అధ్యయన వేత్త, కృతికర్త కావడం వల్లే పురందర దాసుని కర్ణాటక సంగీత పితామహగా కొలుస్తారని చెప్పారు.

## 'సేవాదళ్' రాష్ట్ర కార్యదర్శిగా వరుణ్



నియామకపత్రం అందుకుంటున్న వరుణ్

**చిక్కడపల్లి:** ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ తెలంగాణ కార్యదర్శిగా చిక్కడపల్లికి చెందిన కెప్టెన్ ఆకెళ్ల వరుణ్ రాహుల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్ జాతీయ చీఫ్ ఆర్గనైజర్ లాలా జీ దేశాయ్ పేరుతో జారీ చేసిన నియామకపత్రాన్ని రాష్ట్ర ఆక్టింగ్ ఆర్గనైజర్ ఎం.జితేందర్ చేతుల మీదుగా శుక్రవారం వరుణ్ రాహుల్ అందుకున్నారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్లమెంట్ స్థానాలలో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రత్నం లంగాల, షేక్ నాగుల్, నరేశ్ గౌడ్ తదితరులున్నారు.

## 'పీవీ' ఎంపికపై హర్షం



కె.గీతామూర్తి

**కాచిగూడ:** భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుని దేశ అత్యున్నత పౌరపురస్కారం భారతరత్నకు ఎంపిక చేయడం గర్వించదగ్గ విషయమని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. శుక్రవారం కాచిగూడలోని బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రధాని హోదాలో పీవీ ఆర్థిక సంస్కరణలతో దేశ పురోగతికి పునాదులు వేశారని గుర్తుచేశారు. అవార్డుకి ఎంపిక చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

**తెలుగుజాతికి గర్వకారణం..**



చిక్కా దేవదాసు

**చిక్కడపల్లి:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం తెలుగువారికి గర్వకారణమని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు పేర్కొన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి మార్చిన మహోన్నత వ్యక్తి పీవీ అన్నారు.

## సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ సీతయ్య

**చిక్కడపల్లి:** ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి సీఐ సీతయ్య అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ సీతయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రొద్దుటూరి నర్సింహారావు, కీర్తిశేషులు నరసిన వెంకటేశం కుటుంబసభ్యుల సహకారంతో కార్యక్రమం చేపట్టారు. సంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి చేపూరి లక్ష్మణ్, అదనపు కార్యదర్శి బాలకుమార్, చిట్టిమళ్ల శ్రీనివాస్, ప్రాజెక్ట్ చైర్మన్ తోడుపునూరి రవీందర్‌గుప్తా పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంగీత విభావరి

**చిక్కడపల్లి:** ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కళాభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత విభావరిని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఎంపిక చేసుకున్న ఏకగళ, యుగళ చిత్ర గీతాలను గాయకులు ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు ఎ.నాగేశ్వర్‌రావుకు డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాజగోపాలరావు పురస్కార ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు రఘురాం, వైఎస్.రామకృష్ణ, రామలక్ష్మి, స్వర కల్యాణి, నిషజా రమణి, కమల, ఎస్.లలిత, అమంత, అనంతజ్యోతి పాల్గొన్నారు.

# ఐదు రోజుల్లో పూర్తి



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ శంకర్, ఆర్ఎంఓలు



బ్లడ్ శాంపిళ్లు సేకరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్

- ముగిసిన కానిస్టేబుల్ అభ్యర్థుల ఆరోగ్య పరీక్షలు
- 400 మందికి గానూ 341 మంది హాజరు

**నల్లకుంట:** కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల ఆరోగ్య పరీక్షల క్యాంపు శుక్రవారంతో ముగిసింది. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మొత్తం 400 మందికి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. వీరిలో మొదటి రోజు 79 మంది, రెండో రోజు 69, మూడో రోజు 80, నాలుగో రోజు 73, చివరి రోజు 40 మంది చొప్పున ఐదు రోజుల్లో మొత్తం 341 మంది అభ్యర్థులు టెస్టులకు హాజరయ్యారు. మరో 59 మంది హాజరు కాలేదు.

**ఇవీ పరీక్షలు..**

అభ్యర్థులకు దృష్టి లోపం, కలర్ బ్లైండ్‌నెస్, గ్లకోమా లాంటి నేత్ర పరీక్షలతో పాటు, బీపీ, సుగర్, కార్డియాక్, చెస్ట్ ఎక్స్‌రే, ఈసీజీ, శ్వాస సంబంధిత, సీబీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న వాళ్లని మరిన్ని ఆధునిక పరీక్షల కోసం సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి సిఫారస్ చేస్తారని సమాచారం.

**నిబంధనలకు అనుగుణంగా..**

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కానిస్టేబుల్ అభ్యర్థులకు ఐదు రోజుల్లో ఆరోగ్య పరీక్షలు పూర్తి చేశాం. ఈసీజీ, సీబీపీ, ఎక్స్‌రే, శ్వాస కోశ సంబంధిత పరీక్షలు ఫీవర్ ఆస్పత్రి వైద్య నిపుణుల పర్యవేక్షణలో జరిగాయి. పరీక్షల్లో అవకతవకలకు తావు లేకుండా నాతో పాటు ఇతర అధికారులంతా పర్యవేక్షణ చేశాం. పరీక్షల రిపోర్టులు వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు అందజేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయా వివరాలు అభ్యర్థులకు తెలిసే అవకాశం లేదు. ఈ విషయంలో తమ వైద్యులు, ల్యాబ్ సిబ్బందికి ముందుగానే కచ్చితమైన ఆదేశాలు జారీ చేశాం.

– డాక్టర్ శంకర్, ఫీవర్ మెడికల్ సూపరింటెండెంట్

## మంత్రిని కలిసిన పద్మశాలి సంఘం



**కాచిగూడ:** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, చీఫ్ ఎల్‌వీసీ అడ్వయిజర్ లయన్ కేఎన్ సామ్రాట్, బిల్లా దీపిక తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సామ్రాట్ రూపొందించిన ఎల్‌వీసీ డైరీని మంత్రికి అందజేశారు.

## 12న 'కార్టూన్' సంకలనం ఆవిష్కరణ

**చిక్కడపల్లి:** జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న త్యాగరాయ గానసభలో ×ఎయిటీత్రీ ఫన్ టూన్స్ ₹ కార్టూన్ పోటీల సంకలన ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు చైర్మన్ జి.వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్టూన్ పోటీల విజేతల కార్టూన్లతో రూపొందించిన సంకలనాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అంకితం తీసుకుంటారని చెప్పారు. విజేతలకు మాజీ న్యాయమూర్తి శేషశయన రెడ్డి నగదు పురస్కారాలు అందజేస్తారన్నారు.

## రేపు కుసుమహరుల కల్యాణం



**నల్లకుంట:** రేపు జరగనున్న కుసుమహరుల లీలా కల్యాణ మహోత్సవానికి నల్లకుంట ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ కుసుమహరనాథ ఆశ్రమం ముస్తాబైంది. ఉత్సవంలో భాగంగా శనివారం(నేడు) ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమం ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు ఏకాహము ఉంటుందని ఆశ్రమ పాలక మండలి సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం ఉంటుందన్నారు.

## లా కాలేజీ విద్యార్థుల ఆందోళన

**సాక్షి, సిటీబ్యూరో:** బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాల విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. గతేడాది అక్టోబర్ నుంచి తరగతులను మరొక భవనంలో నిర్వహించడంపై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. లా భవనంలోనే తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించారు. పాత భవనంలో తరగతులు నిర్వహించకుంటే ఉస్మానియా యూనివర్సిటీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## సన్మానం



**కాచిగూడ:** కలెక్టర్ చేతుల మీదుగా హైదరాబాద్ జిల్లా ఉత్తమ మెడికల్ ఆఫీసర్ అవార్డు అందుకున్న కోఠిలోని ఆర్ఎఫ్‌పీటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డిని శుక్రవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్‌యాదవ్, బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేశ్ యాదవ్ సన్మానించారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

**ముషీరాబాద్:** సుమారు రూ.5 కోట్ల విలువ గల 1,100 గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎస్ఆర్టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాంనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్టీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌రావు, ప్రధాన కార్యదర్శి మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.శశికళ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభు తదితరులు మాట్లాడారు. 1-7-1046/8 నుంచి 15 వరకు ఎస్ఆర్టీ పార్కు సమీపంలో 100 గజాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. దీని విలువ సుమారు రూ.5 కోట్లకు పైగా ఉంటుందన్నారు. ఇప్పటికే అనేక మంది లేబర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఈ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయగా.. 1,100 గజాల స్థలం మిగిలి ఉందన్నారు. ఈ స్థలాన్ని కూడా ఓ స్థానికుడితో పాటు కొంతమంది కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పలుమార్లు లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సదరు స్థలంలో అధునాతన భవనాన్ని నిర్మించి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షులు కళావతి, కె.లక్ష్మి, శ్యామూల్, బంగారం, అనంత స్వామి, శ్యామ్‌సుందర్ ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ ఉండాలి



ఉన్నికోట వద్ద చెత్తను పరిశీలిస్తున్న అధికారులు

**కవాడిగూడ:** పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉన్నికోట, చిత్రాలనగర్ బస్తీవాసులకు ముషీరాబాద్ సర్కిల్-15 డీఎంసీ యాదయ్య సూచించారు. కవాడిగూడ డివిజన్ ఉన్నికోటలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద నిర్మించిన ఇళ్ల మధ్యలో చెత్త పేరుకుపోతోందని, డ్రైనేజీలు పొంగుతున్నాయని, చిత్రాలనగర్‌లో కూడా మురుగు సమస్య ఉందని అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం యాదయ్య, సర్కిల్-15 హెల్త్ అధికారి మైత్రేయి బస్తీలను పరిశీలించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. ప్రజలంతా ఇళ్ల దగ్గరకు వచ్చే చెత్త రిక్షాలలోనే చెత్త వేయాలని సూచించారు. ఉన్నికోటలో జనాభాను అనుగుణంగా మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునీకరిస్తామని చెప్పారు. అంతేకాకుండా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అదే విధంగా చిత్రాలనగర్‌లో డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నగర కార్యదర్శి మద్దెల ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రావ్యంగా శాస్త్రీయ గానగోష్ఠి



సంయుక్తను సన్మానిస్తున్న అతిథులు

**చిక్కడపల్లి:** ప్రముఖ సంగీత గురువు సంయుక్త తన శిష్య బృందంతో కలిసి అన్నమయ్య, రామదాసు కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మాజీ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి జన్మదిన వేడుకల్లో భాగంగా సంయుక్త బృందం గానగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ బైస దేవదాసు మాట్లాడుతూ.. సంగీతం మనస్సుకు విశ్రాంతినిస్తుందన్నారు. దేశంలో ఒక ఐఏఎస్ అధికారి పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ప్రజలు జన్మదిన వేడుకలు జరపడం చూడలేదన్నారు. అది కేవలం రమణాచారికే చెందుతుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ.. రమణాచారిపై ఉన్న అభిమానంతో కళాసప్తాహం నిర్వహించామన్నారు.

## విరిగిపడిన చెట్టు కొమ్మ



చెట్టు కొమ్మ తొలగిస్తున్న సిబ్బంది

**చిక్కడపల్లి:** భారీ వృక్షం కొమ్మ విరిగి రోడ్డుపై పడటంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటన చిక్కడపల్లి స్ట్రీట్ నంబర్ 3లో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. కొమ్మ విరిగిపడటంతో కారు కొంచెం ధ్వంసం కాగా ఆటోలో వెళ్తున్న ఒక మహిళ, ముగ్గురు పిల్లలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ డీఆర్ఎఫ్ ఈవీడీఎం సిబ్బందిని అప్రమత్తం చేశారు.

## అన్నదానం



రాంనగర్ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో శుక్రవారం అన్నదానం చేపట్టారు. సమితి అధ్యక్షుడు వాడకట్టి రాజు, కార్యదర్శి కాసనగుట్టు రాజశేఖర్ గుప్తా, బుక్క రమేశ్ గుప్తా, ఎర్రం శ్రీనివాస్, చల్లా శివకుమార్, గంజి శ్రీనివాస్ తదితరులు కార్యక్రమాన్ని చేపట్టారు.

– ముషీరాబాద్

## చదువుతో పాటు ఉద్యోగావకాశం

**కాచిగూడ:** ఆర్థికంగా వెనుకబడిన యువతకు ఉచితంగా ఫుల్ టైమ్ డిగ్రీ కోర్సు చదువు, ఉద్యోగంతో పాటు నెలకు రూ.12 వేల స్టైఫండ్ ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు కిరణ్ తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా అందిస్తున్న ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా పాస్, డిగ్రీ డ్రాపవుట్, బీటెక్ డ్రాప్ అయిన విద్యార్థులు అర్హులు. ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు గాగిల్లాపూర్(గండిమైసమ్మ టెంపుల్ దగ్గర) లోని స్నైడర్ ఎలక్ట్రికల్స్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఉచిత భోజన వసతి ఉంటుందని తెలిపారు. వివరాలకు సెల్: 79899 95685లో సంప్రదించవచ్చు.

## పాదయాత్రికులకు నేడు సత్కారం

**కాచిగూడ:** అయోధ్యకు పాదయాత్రగా వెళ్లి వచ్చిన యువతకు నేడు(శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో సత్కార కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ శుక్రవారం తెలిపారు. శ్రీరామ భక్తులు, ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. మోర సుదర్శన్ ముదిరాజ్, గోవింద్ రాములు ముదిరాజ్, డి.సదానంద్ ముదిరాజ్ తదితరులు కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు.

## ఆకట్టుకున్న ఐటీ క్విజ్ పోటీలు



హనుమాన్ చౌదరిని సన్మానిస్తున్న సభ్యులు

**కాచిగూడ:** కాచిగూడలోని భద్రుక కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయిలో ఐటీ క్విజ్ పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్, రోలింగ్ ట్రోఫిని లక్ష్మీనివాస్ భద్రుక అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ టి.హనుమాన్ చౌదరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణకుమార్ అగర్వాల్, శ్రీశ్రీ కిషన్ భద్రుక, ప్రొఫెసర్ అభిరామకృష్ణ, డాక్టర్ మూర్తి, ఎస్.కృష్ణవేణి పాల్గొన్నారు.

## 'క్లబ్' కార్మికులకు ఉపాధి కల్పించాలి

**కాచిగూడ:** ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంతో ఫ్యామిలీ క్లబ్‌లు మూతపడ్డాయని తెలంగాణ ఫ్యామిలీ క్లబ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జెల్ల పరమేశ్ గౌడ్ అన్నారు. ఫలితంగా దాదాపు 10వేల మంది రోడ్డున పడ్డారని ఆవేదన చెందారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫ్యామిలీ క్లబ్‌లలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు జీవనోపాధి కల్పించడంలో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అయితే, సొసైటీ క్లబ్‌లు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ సమస్యలను పరిష్కరిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర మంత్రులను, ఉన్నతాధికారులను కలుస్తామని చెప్పారు.

## కళాకారుల సంక్షేమానికి కృషి



అంజిబాబును సన్మానిస్తున్న మంత్రి

**చిక్కడపల్లి:** కళల అభివృద్ధికి, కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కథక్ నృత్యంలో శిక్షణ ఇస్తున్న ప్రముఖ కథక్ నృత్య కళాకారుడు, నాట్యగురువు పండిట్ అంజిబాబును తన ఛాంబర్‌లో శుక్రవారం మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

## 'రేషన్‌కార్డు తప్పనిసరి చేయడం అన్యాయం'



వినయ్‌కుమార్

**చిక్కడపల్లి:** ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు రేషన్‌కార్డు తప్పనిసరి చేయడం అన్యాయమని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ ఆరోపించారు. గాంధీనగర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో కొన్నింటికి రేషన్‌కార్డుదారులకు వర్తింపచేయడం సరికాదన్నారు. ఇటీవల కాంగ్రెస్ అభయ హస్తం పేరుతో నిర్వహించిన దరఖాస్తు స్వీకరణలో రేషన్‌కార్డుల కోసం లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాన్నే ప్రస్తుతం కాంగ్రెస్ గవర్నమెంట్ కూడా కొనసాగిస్తోందని వినయ్‌కుమార్ ఆరోపించారు.

## వివాహ ఆహ్వానం



**ముషీరాబాద్:** ఈనెల 14న జరగనున్న తమ కుమారుడు మహేశ్ వివాహానికి రావాల్సిందిగా ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్రం శంకర్ సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆహ్వానించారు. వెడ్డింగ్ కార్డులను కోల్‌కతాలో ప్రత్యేకంగా తయారు చేయించామని, ఒక్కో వెడ్డింగ్ కార్డుకు సుమారు రూ.5 వేలు ఖర్చు అయ్యిందని శంకర్ తెలిపారు.

## వేధించి.. హత్యకు గురయ్యాడు!



వహీద్ పాషా మృతదేహం

**అంబర్‌పేట్:** తోపుడు బండిపై రొట్టెలు చేసుకునే ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించి వ్యక్తిని బాధితురాలే హతమార్చింది. ఈ సంఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం.. అంబర్‌పేట పటేల్‌నగర్‌లో నివసించే రుక్మిణీబాయి(52) భర్త ముదావత్ కూలి పనులతో పాటు సాయంత్రం రొట్టెలు అమ్ముతుంది. ఈక్రమంలో అంబర్‌పేటలో ఉంటూ కూలి పనులు చేసుకునే వహీద్ పాషా(37) రుక్మిణీబాయి వద్ద రొట్టెలు తీసుకునేవాడు. ఈ నెల 8వ తేదీ రాత్రి తాగిన మైకంలో రుక్మిణీబాయి ఇంటికి వెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో అతనిపై తిరగబడి రోకలిబండతో కడుపులో గుద్ది, గొంతు గట్టిగా పట్టుకోవడంతో పాషా కిందపడిపోయాడు. ఆందోళనకు గురైన రుక్మిణీబాయి అంబర్‌పేట పోలీసులకు విషయం చెప్పింది. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి చూడగా వహీద్ పాషా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. రుక్మిణీబాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.